క్లుప్తంగా

30 నుంచి సచివాలయ పరిధిలో వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మండల పరిషత్ హాలులో సోమవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ నెల 30 నుంచి ప్రతి సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు బాధ్యత తీసుకోవాలన్నారు. ముందుగా ఆయా సెక్టార్ల వారు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీవో మన్మథరావు, డీటీ వినయ్‌కుమార్, ఎంఈవో శివనాయుడు, వైద్యాధికారులు దుర్గా ప్రవళిక, వినోద్ పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : నాగులాపల్లి జేపీ అగ్రహారంలో సోమవారం అభయాంజనేయస్వామి పంచముఖ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దొడ్డి శ్రీనివాసరావు సమకూర్చిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

చంద్రబాబు పాపం పండింది



మాట్లాడుతున్న దగ్గుపల్లి సాయిబాబా

పాయకరావుపేట : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఎ–1 నిందితుడిగా వున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకి ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా అన్నారు. పట్టణంలో తన కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాపం పండిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో రూ.341 కోట్లు స్కామ్‌కు పాల్పడ్డారన్నారు. ప్రజల సొమ్మును కాజేసిన ఏ రాజకీయ నాయకుడికైనా ఇదే గతి పడుతుందన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి, దర్శనాలు చేసుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన నిర్వహించారు. కస్పావీధి సాంబశివుని ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిపారు.

'చంద్రబాబు ఆర్థిక నేరస్తుడే'



విలేకర్లతో మాట్లాడుతున్న వీసం రామకృష్ణ తదితరులు

నక్కపల్లి : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు ముమ్మాటికీ నేరస్తుడేనని కోర్టు అతనికి రిమాండ్‌కు విధించడం స్వాగతిస్తున్నామని ఏపి పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ బయటపడిందన్నారు. అప్పట్లోనే కేసు నమోదు చేస్తే చంద్రబాబు తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచారణ జరగకుండా మేనేజ్ చేశారన్నారు. తాజాగా సీఐడీ చంద్రబాబుకు ఈ కేసులో ప్రత్యక్ష ప్రమేయం ఉందని, ఆయన కుటుంబీకుల ఖాతాల్లోకి కోట్లాది రూపాయలు మళ్లాయని నిర్ధారించుకున్న తర్వాత అరెస్టు చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు ఆర్థిక నేరస్తుడని, తన హయాంలో సుమారు రూ.6 లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డాడన్నారు. అవన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. స్కిల్ స్కాము కంటే అమరావతి రాజధాని స్కాము ఇంకా పెద్దదన్నారు. ఈ ఒక్క స్కాములోనే లక్ష కోట్ల అవినీతి జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్టును రాజకీయ కక్ష సాధింపు చర్యగా ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే విచారణ ఎదుర్కొని తన నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, పాపారావు, వైస్ ఎంపీపీ నానాజీ పాల్గొన్నారు.

అర్హతే కొలమానంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే బాబూరావు
- దార్లపూడిలో 'గడప గడపకు'



మహిళకు ప్రభుత్వ సంక్షేమ పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయా అంటూ లబ్ధిదారులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆరా తీశారు. మండలంలో దార్లపూడి గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుల సమస్యలు అడుగుతూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే కొలమానంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ బడుగు, బలహీనవర్గాలకు విద్య, వైద్యం అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా సర్కారు బడుల్లో నణ్యత గల విద్య విద్యార్థులకు అందిస్తున్నారని, విద్యా వ్యవస్థలో సమూలమార్పులు తీసుకొచ్చి పేదలకు కార్పొరేటర్ విద్యను దగ్గర చేయడం గర్వించ దగ్గ విషయమన్నారు. అంతకుముందు ప్రభుత్వ సంక్షేమ పుస్తకాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ మెంబర్ కశింకోట నీలేంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, సతీష్, శ్రీను, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో దార్లపూడి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొంటారని ఆయన తెలిపారు. పలు శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

జగనన్న పాలనలోనే అందరి సంక్షేమం



తులసీనగర్ సచివాలయంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. తులసీనగర్ సచివాలయంలో 5,6వ వార్డులకు సంబంధించి సోమవారం కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో ప్రతి వార్డులో కల్వర్టులు, రోడ్లు, డ్రెయినేజీలు చెరువుల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. వలంటీర్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, వాటి లబ్ధిని గూర్చి వివరించి పథకాలు అందేలా కృషి చేయాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల కొండబాబు, మహిళా కానిస్టేబుల్ కుమారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 30 వ తేదీ నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో ప్రారంభమవుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, గ్రామాల్లో ప్రతి ఇంటికి సచివాలయ వలంటీర్లు, ఏఎన్ఎంతో కలసి ప్రజల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య సమస్యలపై జగనన్న ఆరోగ్య యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో 30వ తేదీ నుంచి ఒక్కో గ్రామంలో డాక్టర్ల బృందం పర్యటించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

సామాజిక భవనానికి నిధుల మంజూరు



సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు పత్రాలను అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా తన పార్లమెంట్ పరిధిలో అంబేద్కర్ పేరిట సామాజిక భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిధుల విడుదల పత్రాలను కశింకోట గ్రామ సర్పంచ్ జయరజినికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతలో కశింకోటలో సామాజిక భవన నిర్మాణానికి స్థానికులు వినతి పత్రం అందించారని, ఆ మేరకు ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కశింకోట నాయకులు ఎం.అప్పలనాయుడు, బి.సత్యారావు, ఎస్.సత్యనారాయణ, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 30 మంది రోగులు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యుడు

అనకాపల్లిటౌన్: ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో భాగంగా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించడమే కాకుండా కంటిచూపు మందగించదని విశాఖ శంకర్ ఫౌండేషన్ క్యాంప్ డిప్యూటీ మేనేజర్ ఎం. అరుణ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం కేఎన్ఆర్‌పేటలో శంకర్ ఫౌండేషన్, శ్రీ సీతారామ మహిళా సేవాసంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా 30ని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరి ఆపరేషన్‌కు కావలసిన అన్ని రకాలైన పరీక్షలు చేసి, ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామ సేవా సంఘం వ్యవస్థాపకుడు చూచుకొండ రమణ, సభ్యులు కశిరెడ్డి శ్రీనివాసరావు, సుశీల, బల్లిన నాగమణి, నూకరత్నం, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి సాయం చేస్తున్న మిత్రులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి స్నేహితులు, దాతలు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించి ఆసరాగా నిలిచారు. తాళ్లపాలేనికి చెందిన కర్రి నూకరాజు సమీపంలోని ఓ సిమెంట్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తూ, ఇంటికి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. దీంతో అతని టెన్త్ బ్యాచ్ స్నేహితులు కుటుంబానికి అండగా నిలవాలని భావించి రూ.35 వేలు సమకూర్చారు. స్థానిక బీజేపీ నాయకుడు గళ్లా రాజు రూ.10 వేలు, సిమెంట్ పరిశ్రమ లేబర్ కాంట్రాక్టర్ రూ.25 వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని నూకరాజు కుటుంబానికి సోమవారం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో టెన్త్ బ్యాచ్ స్నేహితులు కర్రి లోవరాజు, గుమ్మడి శ్రీను, అనిల్, చిన్ని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పొలం పనుల్లో రైతులు బిజీ

అనకాపల్లిటౌన్: అల్ప పీడన ప్రభావంతో వర్షాలు దంచికొడుతున్నాయి. సోమవారం గంటపాటు ఎడతెరిపివ్వకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎండిపోయే దశకు చేరుకున్న వరినారుకు ఈ వర్షాలు జీవం పోశాయి. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు తలమునకలవుతున్నారు.

ఉగ్గినపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చర్యలు చేపడతారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు, అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాల్సిందిగా కోరారు.

కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు వేయించాలి

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భైరాగి



కె.సంతపాలెంలో రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ భైరాగి

కె.కోటపాడు: పశువులు ఈనిన రెండు నెలల సమయానికి ఎదకు రానున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.భైరాగి అన్నారు. ఎదకు వచ్చే సమయంలో ఆయా పశువుకు కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు వేయించడం ద్వారా చూడికట్టే శాతం ఉంటుందని తెలిపారు. పశు విజ్ఞాన బడిలో భాగంగా కె.సంతపాలెంలో సోమవారం పాడి రైతులకు పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఆడపెయ్యల ఉత్పత్తి పథకంలో పశువులకు రెండు డోసుల వీర్యానికి రూ.500 చెల్లించాలని తెలిపారు. ఆడపెయ్య జన్మించని పక్షంలో రైతులు చెల్లించిన నగదు వాపసు చేస్తామన్నారు. పాడి పశువులకు పచ్చగడ్డిని ఆహారంగా అందించాలని సూచించారు. పచ్చగడ్డిలో విటమిన్ –ఏ ఉండటం వల్ల ఆరోగ్యంతోపాటు చూడికట్టే పరిస్థితి మెరుగ్గా ఉంటుందని వివరించారు. సమావేశంలో పశువైద్య సహాయకుడు త్రినాథ్ పాల్గొన్నారు.

2 గ్రామాల్లో గృహ సారథుల బీమా నమోదు



ఎం. అలమండలో మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ రమణ

దేవరాపల్లి: ఎం. అలమండలో స్థానిక సర్పంచ్ దాడి జగన్, కొత్తపెంటలో సర్పంచ్ రొంగలి వెంకటరావు అధ్యక్షతన గ్రామ సచివాలయ గృహ సారథుల బీమా నమోదు శిబిరాలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా గృహ సారథుల బీమా నమోదుపై సచివాలయ కన్వీనర్లకు జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ అవగాహన కల్పించారు. జేసీఎస్ సైన్యం యాప్ ద్వారా కన్వీనర్లకు శిక్షణ ఇచ్చి దగ్గరుండి గృహ సారథులకు బీమా నమోదు ప్రక్రియను చేయించారు. ఈ నెల 15లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సచివాలయ కన్వీనర్లకు సూచించారు. మంగళవారం నాగయ్యపేట, కాశీపురం గ్రామాల్లో బీమా నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఎం. అలమండ ఎంపీటీసీ పోతల వెంకటరావు, పొలిపిరెడ్డి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కానరాని బంద్ ప్రభావం



నక్కపల్లిలో జాతీయరహదారిపై నినాదాలు చేస్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు



మునగపాకలో కూరగాయల దుకాణాన్ని బలవంతంగా మూయిస్తున్న టీడీపీ శ్రేణులు

మునగపాక : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించడంపై నిరసనగా టీడీపీ ఇచ్చిన బంద్‌కు ప్రజల నుంచి స్పందన కరువైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో భాగంగా చంద్రబాబుకు రిమాండ్ విధించడంతో ప్రజల్లో సానుభూతి పొందాలని ఆశించిన తమ్ముళ్లకు భంగం వాటిల్లింది. మునగపాకలో వాహనాల రాకపోకలు, బస్సులు యథావిధిగా సాగాయి. ప్రభుత్వ సంస్థలు పనిచేశాయి. తెల్లవారుజామున తోటాడ జంక్షన్ వద్ద బ్రాండిక్స్ బస్సులను ఆపేందుకు టీడీపీ శ్రేణులు రాగా విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు.

పాయకరావుపేట : టీడీపీ నాయకులు సోమవారం చేపట్టిన బంద్ విఫలమైంది. దుకాణాలు, హోటల్స్ వ్యాపారాలు సాగించాయి. పాఠశాలలకు మినహా అన్ని కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు యథా ప్రకారం పని చేసాయి. బస్సులు యథావిధిగా తిరిగాయి. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు పార్టీ జెండాలతో రోడ్లపై తిరిగి బంద్‌కు మద్దతివ్వాలని వర్తకులపై ఒత్తిడి తెచ్చారు. వారు వెళ్లిపోయిన తర్వాత దుకాణదారులు యథా ప్రకారం వ్యాపారాలు సాగించారు. స్థానిక సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఏవిధమైన సంఘటనలు, గొడవలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

నక్కపల్లి: టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన బంద్‌కు స్పందన లభించలేదు. నక్కపల్లిలో టీడీపీ జనసేన కార్యకర్తలు దుకాణాలు, పాఠశాలల వద్దకు వెళ్లి బలవంతంగా మూసివేయించాలని ప్రయత్నించారు. అయితే వ్యాపారులు ఉదయం కొద్దిసేపు దుకాణాలు మూసి, తిరిగి యథావిధిగా వ్యాపారాలు సాగించారు బస్సులు, ఆటోలు,ఇతర వాహనాలు సజావుగా రాకపోకలు సాగించాయి.

ఎస్.రాయవరం: ఎస్.రాయవరంలో సోమవారం టీడీపీ తలపెట్టిన బంద్‌కు ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. అన్ని దుకాణ సముదాయాలతో పాటు ప్రజా రవాణాశాఖ బస్సులను టీడీపీ నేతలు నిలువరించకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. అటు దుకాణాల కార్యకలాపాలతో పాటు రవాణాకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. పోలీసు అధికారులు మండల కేంద్రంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఇంటింటా ధర్మ ప్రచారం



స్టిక్కర్లతో ప్రచారం

రాంబిల్లి : వాడ నర్సాపురం గ్రామంలో సోమవారం ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గగన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టిక్కర్లతో ధర్మ ప్రచారం, భజనలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం



దిమిలిలో వినాయక ఉత్సవాల రాట కార్యక్రమం

రాంబిల్లి : దిమిలిలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాల రాట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు కె.టి. దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 18 న గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని దీక్షితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

మునగపాకలో ఓ మోస్తరు వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం ఊరట నిచ్చింది. ఖరీఫ్ వరికి సంబంధించి రైతులు ముమ్మరంగా పనుల్లో బిజీగా ఉన్నారు. సాగునీటి కాలువల ఆధారంగా పంటలు పండించే రైతులకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు చెరకు సాగు కు కూడా ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆందోళన



కొమిర సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

రావికమతం: ఉరలోవ కొండను ఆనుకున్న రెవెన్యూను వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో సాగుదారుల వివరాలను నమోదు చేయాలని కొమిర, కవగుంట, బుడ్డబంద గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం కొమిర సచివాలయం వద్ద ఆందోళన చేశారు. ఉరలోవ కొండ రెవెన్యూలో 370 ఎకరాలకు 412 మందికి 2013లో పట్టాలిచ్చారని, ఆ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని వాపోయారు. ప్రభుత్వం చేస్తున్న రీసర్వేలోనైనా సెటిల్‌మెంట్ రికార్డులు తయారు చేసి తమ పేర్లు నమోదు చేయాలని గిరిజన సంఘం రైతులు సాలం రాజిబాబు, బూరిగ రత్నం, ఎస్.లక్ష్మి తదితరులు కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని మొబైల్ ఐటీసీ కౌన్సిలర్ అర్జున్ కోరారు. అచ్యుతాపురం మండలం మార్టూరు, మడుతూరు గ్రామాల్లో సోమవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అలాగే గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 43 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎల్‌టీ కిషోర్, లింక్ వర్కర్ బి.సత్యనారాయణ, సర్పంచ్ రమేష్‌బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



మట్టి వినాయకులను ప్రదర్శిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక చవితికి వారివారి గృహాల్లో, వీధుల్లో మట్టి గణపతిని పూజించాలని పిలుపునిచ్చారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వినాయక నిమజ్జనోత్సవాల్లో నది, కాలువల్లో దిగే సందర్భాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి, కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, తాటికొండ శ్రీకాంత్, కాండ్రేగుల సర్వేశ్వరరావు, పోలారపు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబానికి బీమా పరిహారం



పాడి రైతు కుటుంబానికి బీమా పరిహారాన్ని అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పాల సంఘం సభ్యుడు, ఇటీవల మృతి చెందిన పాడి రైతు విరోదుల శ్రీనుబాబు కుటుంబానికి విశాఖ డెయిరీ తరఫున రూ.లక్ష బీమా పరిహారాన్ని మంజూరు చేశారు. డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని మృతుని భార్య సంతోషికి సోమవారం అందించారు. కార్యక్రమంలో డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ ఇ.శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, ఇందల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులు కురిసెను



సంతబయలలో కురుస్తున్న వర్షం

కశింకోట: కశింకోట ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీధులు చిత్తడిగా మారాయి. మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మబ్బులు వేసి వర్షం ప్రారంభమైంది. కొంతసేపు మోస్తరుగా వర్షం పడిన తర్వాత నుంచి సాయంత్రం వరకు జల్లులు కొనసాగాయి. ఈ వర్షం ఖరీఫ్ వరి నాట్లకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.